# చౌధరి పురుషోత్తం 1803-1890.

అవమానములు భవ్యమగు మంచి బహుమతుల్
　దూషణంబులు మణి భూషణములు
అపహాస్యములు చంద్రహారముల్ మరి క్రూర
　దృష్టి పాతములు ముత్తియపు సరులు
నిందాకటూక్తులింపొందు చందన సుగం
　ధామోద లిప్త శ్రేష్టాంబరములు
తాడనంబులు మూర్ధ తైలాభిషేకముల్
　గద్దింపు లబ్జ రాగముల గనులు

చిత్త విశ్రాంతిగల క్రైస్తవోత్తమునకు
ధరను చెందు విపత్పరంపరలు, ఇంపు
సొంపుగల సంపదల భంగి జూడ నొప్పె
యేసు వాక్యార్థ మెదలోన నిముడు వలన.

తాను తింటున్న దెబ్బలు, పొందుతున్న అవమానాలు కేవలం ముత్తియపు సరాలుగా, బహుమానాలుగా భావించి, తన ఏకైక గురియైన దేవునివైపు దృష్టి మరల్చడం ఒక అలౌకికానుభవం. భక్తిజీవితం పరిపక్వం చెందినప్పుడే లౌకికాన్ని ఈసడించి పార లౌకికాన్ని ఆశించడం జరుగుతుంది. అది భక్తుని జీవితంలో పరాకాష్ట. అస్థితన అందుకొన్నాడు గనుకే చౌధరి పురుషోత్తం తన సుదీర్ఘ జీవితంలో తటస్థించిన సమస్త మాన అవమానాలు సంతోషంగా స్వీకరించాడు. భక్తిభావంతో తాదాత్మ్యం చెందినప్పుడు తగిలే ముష్టిఘాతాల స్పర్శ భక్తుడు పొందడు. అవమానాలు బహుమానాలుగ, దూషణలు మేలైన భూషణాలుగా, వేళాకోళాలు చంద్రహారాలుగ, నిర్దయదృష్టులే ముత్యాల సరాలుగ, నిందలు సుగంధ పూతలుగ, పరుషోక్తులు కెంపు గనులుగ. భావిస్తాడట. ప్రశాంతమైన మనసుగల క్రైస్తవుడు పొందే ఐహిక విపత్పరంపరలే ఆముష్మిక సంపదలట. సమస్త శ్రమలను సహించిన సిలువ

ధారి, శ్రమచక్రవర్తి క్రీస్తుసూక్తులు తనలో కుదురుకొన్నందువల్ల పై శ్రమలెన్న దగినవికావట. క్రీస్తుపొందిన పరార్థ శ్రమానుభావాలను గ్రహించాడు. కనుకే చౌధరి తనవలె శ్రమపడు వారిని ఆయన పై మాటల్లో తన అనుభవంచెప్పి ఓదార్చ ప్రయత్నించాడు. 1834వ సంవత్సరాంతంలో చెన్నపట్టణంలోని జార్జి టౌన్ సంతవీధిలో, సాయం సంధ్యా సమయంలో గొంతెత్తి క్రీస్తు సువార్తను ప్రకటిస్తున్నప్పుడు అచటగల రౌడీమూక బలవంతంగా కాళ్ళుకొందరు, చేతులు కొందరు పట్టుకొని ఊయలనూపి విసరి వేయబోతున్నప్పు డెవరో పుణ్యాత్ముల ప్రమేయంవల్ల బ్రతికి బయటపడి, చౌధరి పురుషోత్తం ఆ తరువాత ఊరడింపుగా పై పద్యాన్ని వ్రాసికొన్నాడు. ఆంధ్ర క్రైస్తవ భక్తకవుల్లో కాలానుగుణ్యంగానే గాక, చేసిన సాహిత్య సువార్త సేవలబట్టీ, జీవించిన విధానాన్నిబట్టి అగ్రతాంబూలం అందుకొన్న మహామనీషి ఈ చౌధరి.

## జీవిత విశేషాలు[1] :

కొందరు భ్రమపడినట్లు చౌధరి కులసూచక పదంకాదు. వీరి పూర్వీకులు పశ్చిమ బెంగాల్‌కు చెందినందున అచటి సంప్రదాయం ప్రకారం వీరి ఇంటిపేరు చౌధరి. ఆయనకు రెండు మూడు తరాలకుముందు వారు పశ్చిమ బెంగాల్‌లోని 'మిధునపురం' నుండి ఉత్కళకు తరలివచ్చి, పర్లాకిమిడి పరిసర ప్రాంతాలలో స్థిరపడిపోయారు. వీరు బెంగాల్ బ్రాహ్మణులు. ఈయన తండ్రి కూర్మనాథ చౌధరి, తల్లి సుభద్రాదేవి చౌధరాణి. జననం 1803 సెప్టెంబరు 5వ తేదీ. జన్మస్థలం గంజాం జిల్లా తెంబూరు ముఠా మదనాపుర గ్రామం. ఏడవయేట ఉపనయనం జరిపి, గౌడ బ్రాహ్మణాచార ప్రకారం యజ్ఞోప వీతోద్విజుని చేసి, గాయత్రీ మంత్రోపదేశాన్ని గావించారు. వయసుతోపాటు పురాణేతి హాసాలనేగాక, వేద పారాయణాన్ని కొనసాగిస్తూ, సంధ్యావందనాది నిత్యకృత్య నిరతుడై ఏకసంథాగ్రాహిగా ప్రసిద్ధి చెందాడు. బాల్యంనుండి మతనిష్ఠగల పురుషోత్తం చౌధరి. విగ్రహోపాసనాలతో, జపతప స్నానోపవాసాలతో, తీర్థయాత్రలు సాగించి వైష్ణవ మతావలంబిగాన, భుజాలపై శంఖుచక్రాలు కాల్పించుకొని, గురూపదేశాలు తు చ. తప్పక పాటించాడు.

---

1. ఈ రచన కాధారం పై కవిశేఖరుని మనుమడు బాబుజాన్ చౌధరి వ్రాసి ప్రచురించిన "రెవ. పురుషోత్తమ చౌధరి" అనే గ్రంథం.

గౌడ విశిష్ట శాఖల్లో ఉన్న పరిపాటి ప్రకారం మేనమామ రఘునాథపాల్ మహంతిగారి కుమార్తె రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. అప్పటికి ఆయన వయస్సు 20 సం॥లు కాగా, రాధామణిదేవికి తొమ్మిదేండ్లు. కన్యలకు రజస్వలానంతర వివాహాలు అప్పటి కసమ్మతం గాన అంత చిన్న వయస్సు లోనే వివాహం జరిగింది. నూనూగు మీసాలు మూగునాడే ఈ కవి "విష్ణు పరమున ఏడెనిమిది కీర్తనలను, శివపరమున నొకటియు, గురుపరమున నొక తత్వకీర్తనయు, కృష్ణలీల నొకటియు, అంత్యపాదమున 'దశరథ రామా' యని వచ్చు రామ శతక మొకటియు, 'నీలాచల విలాస' మను పద్యకావ్య ప్రబంధ మొకటియు" రచించాడు. అప్పటికీ కవి జదివిన హిందూ వేదాంత గ్రంథాలు "రామ స్తవరాజం" 'వేదాంత సారం', 'శివయోగసారం', 'ఆత్మబోధ', విజ్ఞాన దీపిక' 'జీవప్రబోధ', భాగవత పురాణ గాథలు, 'సాంఖ్యయోగం', నారదముని ధర్మజుని కుపదేశించిన 'పరమహంస ధర్మం'. ఉత్కళ భాషలో మంచి ప్రవేశం గల ఈ కవి ఆ భాషలో వెలువడిన విశిష్టమైన గ్రంథాలతో పాటు 'అవధూత చరిత్ర'ను కూడ ఒంటపట్టించుకొన్నారు. సర్వ సంగ పరిత్యాగి కావాలని కవి కోరిక. కాని దైవసంకల్పం వేరొకవిధంగా ఉంది.

అన్నగారి అనుమతితో పాఠశాల నడిపిస్తున్న చౌధరికి 1882లో మొట్ట మొదట క్రైస్తవ మత సంబంధమైన జిజ్ఞాస కలిగింది. ఆ జిజ్ఞాస అన్వేషణకు పురికొల్పింది. అపుడే ముద్రణ పొంది దేశమంతా వ్యాపిస్తున్న కరపత్రం ఒకటి చేతికి దొరికింది. ఇది సిరంపూర్ మిషనెరీ విల్యం కేరీ తెలుగులో వ్రాసి అచ్చు వేయించిన క్రైస్తవమత కరపత్రం. ఈ విల్యం కేరీ బహుముఖ ప్రజ్ఞాశాలి. భారతదేశ క్రైస్తవ సంఘానికి వేదాంత విద్యాలయంయొక్క అవసరాన్ని గుర్తించి, పూర్వరంగాన్ని సిద్ధపరచిన దీర్ఘ యోచనాపరుడు. బహుభాషా కోవిదుడు, విశేషించి సంస్కృత భాషా నిష్ణాతుడు.

1888లో ప్రప్రథమంగా చౌధరికి హెలెన్‌నాట్ (Helen Knoth) సతితో పరిచయం కలిగింది. ఈ భక్తురాలు చౌధరికి ఆధ్యాత్మిక జనని. నూట రెండు సంవత్సరాలు జీవించి, బెంగుళూరులోనే కన్నుమూసిన పుణ్యశాలిని. ఇదే సంవ త్సరం చౌధరికి, మేజర్ బ్రెట్ అను సైనికాధికారితోను, విల్యం డాసన్‌తోను పరి చయమైంది. అది విశాఖపట్టణంలో సంగతి అప్పటికి రెవ. ప్రిచెట్ 1818లో విశాఖలో అనువదించిన నూతన నిబంధన మొదట సిరంపూర్‌లో, తరువాత

మద్రాస్‌లో (1829) అచ్చైంది. ఆ ప్రతి పురుషోత్తంగారి ఆత్మతృష్ణను తీర్చింది.

ఆయనలో క్రమంగా క్రైస్తవ మతంపై కుదురుకొంటున్న విశ్వాసం స్థిర పడి, 1833 జూన్ నెల 10వ తేదీ యజ్ఞోపవీతాన్ని విసర్జించి, 'కులాచార పరీక్ష' అనే పత్రికను రచించారు. కూలాచారంతో పాటు దేశాని కరిష్టదాయక మైన ఇతర మూఢాచారాలను ఖండిస్తూ 'ముక్తిమార్గ ప్రదర్శనం' మొదలైన పుస్తక సముదాయాన్ని ప్రచురించారు. ఆపిదప అన్న, తల్లి, ఇతర బంధువర్గం నుండి వస్తున్న అవరోధాల నెదుర్కొని, కటక్ చేరి రెవ. లేసీద్వారా 1833 అక్టోబరు 6వ తేదీ క్రైస్తవమత దీక్షతను పొందారు. ఆ దినమే ఈ భక్తుడు మిగిలిన క్రైస్తవులతో ఆరాధిస్తూ—

"మా యేసుక్రీస్తుని - మరుగు గల్గెనురా

నా యాత్మ ఘన రక్ష - నగము నెక్కెనురా!" గానం చేసారు.

చౌధరి పురుషోత్తం క్రైస్తవమత దీక్షను పొందడంతో, ప్రియులందరి కప్రియుడు కావలసివచ్చింది. పైపెచ్చు తాను పొందిన రక్షణానుభవాన్ని పదిమందికి చాటాలనే తహతహ మరింత ప్రబలింది. ఆ కారణంగా విశాఖనుండి మద్రాస్ చేరి, అట శ్రమానుభవంలో పెరిగి, ఆ పిదప సుమారు 440 మైళ్ళు కాలినడకను ప్రయాణంచేసి, దారిలో సువార్తను చెప్తూ బళ్ళారి చేరారు. 'రీడ్స్' అనే మిషనెరీ వీరిని ఆహ్వానించి ఆదరించారు. కాని తన సేవను స్వకీయుల మధ్య కొనసాగించాలని కోరి, బళ్ళారినుండి గుంతకల్లు, అనంతపూర్, మదనపల్లి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, మంగళగిరి, బెజవాడ, ఉయ్యూరు, బందరు, భీమవరం, నర్సాపూర్, రాజమండ్రి, తుని మీదుగా విశాఖ చేరారు. ఈ స్థలాలన్ని ప్రస్తుతం క్రైస్తవమతకేంద్రాలుగా ఉన్నాయి. మంగళగిరిలో చౌధరి బోధిస్తుండగా, "ఒక బ్రాహ్మణ కుటుంబంవారు భోజనమునకు బిలిచి, అరుగు అలికి, ముగ్గులుబెట్టి, విస్తరు వేసి, షడ్రసోపేతముగ భోజనం పెట్టారు."

1835 డిశంబరు 22వ తేదీ రాధామణిదేవి చౌధరాణి తాను భర్తతో కలిసి జీవించడానికి నిర్ణయం చేసికొంది. ఆనాటినుండి ఆమె దివంగతురాలయ్యే

పర్యంతం భర్తతోడిదే లోకమని సమస్తాన్ని సహనంతో భరించింది. శ్రీకాకుళంలో కొన్నాళ్ళుండి, 1836లో కటక్ చేరారు. అక్కడే 1836 సం॥ ఏప్రిల్ 3వ తేది ఆమె క్రైస్తవమత దీక్షను పొందింది. అదే సంవత్సరం, అదే నెల 24వ తేది ఆదివారం చౌధరిని క్రైస్తవమత గురువుగా అభిషేకించారు. ఆ సంవత్సరమే విశాఖలో ఆంధ్ర క్రైస్తవ దేవాలయం, తొలిసారిగా వెలిసింది.

బరంపురానికి సహాయక మిషనెరీగ నియుక్తుడైన చౌధరి, బాలాజీ సాహూ అను మరొక బ్రాహ్మణ క్రైస్తవుని కుటుంబంతో కలిసి, విస్తారమైన సేవ చేశారు. శ్రీకాకుళానికి కలెక్టరుగా వచ్చిన ఇ. స్టోరి (E. Story) కోరికపై చౌధరి శ్రీకాకుళ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న సమయంలో, అమెరికన్ బాప్టిస్ట్ ప్రథమ మిషనెరీ రెవ. సామ్యూల్ యస్. డే గారితో కలిసి ఆయా ప్రాంతాల దర్శించి, క్రీస్తు సువార్తను ప్రకటించారు.

పది సంవత్సరాలు నిర్విఘ్నంగా సువార్త క్షేత్రయాత్ర సాగించిన చౌధరి, 1844లో బరంపురంలో ఉన్నపుడు 'పాపమను మిక్కిలి చీకటి నూతిలో' పడిపోయారు. సహజంగా మానవ స్వభావం పాపభూయిష్ఠమైంది. కాలు జారడం సులభం. అది సామాన్య విషయం. కాని జారిన కాలును తీసికొని, జరిగిన దానికి పశ్చాత్తాపపడి, తిరిగి పుంజుకొని, పాపక్షమ పొందడం ఉత్తమ లక్షణం. చౌధరి జీవితంలో తెలిసి చేసిన తప్పుకై విలపిస్తూ వ్రాసిన గీతాల లోతులను, తుదకొక నిశ్చయం కలిగి, పొందిన ఆత్మానందంతో అంతరంగం గంతులేస్తూండగా గానం చేసిన రాగాలాపాలను మనం తరువాత పరిశీలిస్తాం.

1866లో ఆంధ్రక్రైస్తవుల కొరకై కూర్చబడిన కీర్తనల గ్రంథం మూడవ ముద్రణ పొందింది. అందు చౌధరీగారి కీర్తనలే 78 చేర్చబడ్డాయి. విశాఖపట్టణం చేరి జాన్ హేకి చేయూతగా ఉండి భాషాంతరీకరణం సాగిస్తున్న రోజుల్లోనే 'రక్షణ చరిత్ర', 'ముక్తిమార్గ ప్రదర్శనం', 'మనసే మూలం', 'అంధకార నాశనం', 'మశూచి విశూచి సంకట భ్రాంతి నివృత్తి', 'జగన్నాధ పరీక్ష', 'కులాచార పరీక్ష' మున్నగు పత్రికలు ముద్రణ పొందాయి. ఇవన్నీ ఈ కవి కృతాలే!

తనకు 67 సం॥లు వచ్చు పర్యంతం కోస్తాజిల్లాలలో పర్యటిస్తూ, తన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు చౌధరి. 1870లో దాస్ అంతర్వేదితో పరిచయమేర్పడింది. వీరిరువురు తెలుగు క్రైస్తవ సంఘానికి పితామహులు. 1851లో చౌధరి, విశాఖలో వ్రాసిన క్రైస్తవ నీతి ప్రకాశం, అంతకు ముందు (1845)లో వ్రాసిన శతకాలనొక్క సంపుటిగా రెవ. అంతర్వేది దాస్ 1872లో మద్రాస్‌లో అచ్చు వేయించారు. 1871లో చౌధరి 'సత్య వేద సార సంగ్రహ'మను క్రీస్తు పరతత్వమును రచించారు. క్రీస్తు ప్రభువు యొక్క దైవత్వ నిరూపణకీ గ్రంథమొక ప్రతీక.

1870లో ఉద్యోగ విరమణ గావించిన చౌధరి అంతర్వేది దాస్‌తో కలసి ఆయా ప్రాంతాలను దర్శిస్తూనే ఉన్నారు. 1880 నాటికి, కవికి కనుచూపు మందగించింది. ఆదివారాలు దేవాలయారాధనకై ఆయన్ని సవారిలో కూర్చుండ బెట్టుకొని పోయేవారు. 1882 సం॥ము డిశంబరులో కనుచూపు బాగా మందగించినపుడు - తన కుమార్తెను పిలిపించుకొని 'సకలేంద్రియములారా' - చాలు మీ పనిదీరె అని ఇంద్రియలంపటను తిరస్కరిస్తూ గీతాన్ని గానంచేసి, ఆమెచే వ్రాయించారు. ఈ సందర్భంలో వ్రాయబడిన మరో కీర్తన 'పైనమైయున్నానయ్యా'. తన 87వ ఏట 1890 సం॥ము, ఆగష్టు 23వతేదీ అర్ధరాత్రి ఒంటిగంట కీభక్తుడు తను చిరకాలంగా ఎదురు చూచిన "రవితోను, కుముద బాంధవుతోను మరి దీపచ్ఛవితోను అవసరమింతలేని", 'క్షుదమరియే - ఆ - పద' లేని, జననంబు మరణంబు - సంసార బాధలు లేని పరలోకంలో ప్రవేశించారు.

ఈ భక్తుని జీవితంలోని ప్రతిక్షణం ఆదర్శవంతమైంది. ప్రతి అనుభవం ప్రశంసనీయమైంది. ప్రతి క్రియ అనుసరింపదగింది. ప్రతి పాట ఘడికాలాలపాటు నిలిచేది. ప్రతి కదలిక అచేతన జడ పదార్థాలకు సైతం చేతనత్వాన్ని ఆపాదిస్తుంది. అహోరాత్రులు తాను నమ్మిన దేవుని కోసం కరిగిపోయిన క్రొవ్వొత్తి చౌధరి. తెలుగు భాషకు - ప్రత్యేకంగా తెలుగు క్రైస్తవ సంఘానికి - ఈయన గావించిన సేవ ఆ చంద్రతారార్కం నిలిచి ఉంటుంది. ఈయన కలం చిందులను పరిశీలిస్తేనేగాని, ఈ భక్తకవి తెలుగు తల్లికి తొడిగిన తొడవులు తెలియరావు.

## చౌధరి పురుషోత్తం సాహిత్య కృషి :-

పైన పేర్కొన్న వచన గ్రంథాలు, సిద్ధాంత క్రోడీకరణలతోపాటు, నూటముప్పయికిపైగా నేడు లభిస్తున్న భక్తిసంకీర్తనలు,తత్వాలే గాక, ఈ కవి పద్యకావ్యాలను సైతం వ్రాసినట్లు తానే తెలుపుతున్నాడు.

యేసు నాయకయని యేసుక్రీస్తు ప్రభో
    యను రెండు శతకంబు లొనర మొదట
రచియింపబడె వెన్క రక్షణ సుచరిత్ర
    ప్రకరణత్రయముగ రచితమయ్యె
తదనంతరమున నిస్తర రత్నాకరం
    బను గ్రంథ మొకటి సేయంగబడియె
తరువాత పంచామర పన్నములు వెన్క
    పంచరత్నములల్లబడియె నెలమి
వెనక ముందట పెక్కు కీర్తనలు పత్రి
కలను రచియింపబడి క్రీస్తు కరుణచేత
కడను క్రైస్తవ నీతి ప్రకాశమనెడు
నీ చరిత్రంబు రచియింప నిష్టమయ్యె.

పైపద్యంలోని రెండు శతకాలు, రక్షణసుచరిత్ర, పంచామర పన్నాలను కలిపి, రెవ. అంతర్వేది దాసు మొదట "క్రైస్తవనీతి ప్రకాశము" అనే పేర అచ్చు వేయించారు. ఇప్పటికి అయిదు ముద్రణలు పొందింది. కాగ "నిస్తర రత్నాకరం" ప్రస్తుత మలభ్యం. డా. కొత్తపల్లి వీరభద్రరావుగారు తాము వ్రాసిన "సి. పి. బ్రౌను" అను గ్రంథంలో "బ్రౌనుదొర పరిశోధించి అచ్చువేయించిన గ్రంథాలలో నిస్తరరత్నాకరమొకటి. క్రైస్తవమత ధర్మములను గూర్చి తెలుగు పద్యములలో చెప్పు గ్రంథమిది. దీని పద్యరచన అంత బాగుగాలేక పోవుటవలన, ఒకకవిచే దానిని సరిచేయించి 1852లో బ్రౌనుదొర దానియొక్క మూడువేల ప్రతులను అచ్చు వేయించెను. ఈ గ్రంథములో హిందూ మత దూషణమును తొలగించి అచ్చువేసి బ్రౌనుదొర తన విశాలదృష్టిని ప్రకటించెను" అన్నారు (205p).

బ్రౌన్ 1852లో అచ్చువేయించిన "నిస్తర రత్నాకరం" చౌధరి పురుషోత్తం వ్రాసిన "నిస్తర రత్నాకరం" ఒకటేనా? ఒకటైతే, ఆగ్రంథకర్తనుద్ధహరింపక పోవుటెందుకు? లేక బ్రౌనుదొరకు దొరికిన "నిస్తర రత్నాకరం" మరొక కవి కృతమా? అలాగైతే ఆరచయిత ఎవరు, ఎప్పటి వాడు ?/ మొదలైన విషయాలు పరిశోధనార్హాలు. నాకుచూడ ఈనిస్తర రత్నాకరం చౌధరి పురుషోత్తం, తాను వ్రాసినట్లుగ పేర్కొన్న నిస్తర రత్నాకరం ఒకటిగానే తోస్తుంది. చౌధరికి హిందూమత దూషణ కాదుగాని, విగ్రహారాధన ఖండన ముఖ్యం. ఈ లక్షణం ఆయన వ్రాతల్లో స్పష్టంగా గోచరిస్తుంది. ఈ విగ్రఖండన ఒకవేళ మోతాదును మించిందిగనుక వీరభద్రరావుగారు హిందూమత దూషణగా భావించారేమో ? చౌధరి పద్యరచన నురొకరిచే పరిష్కరింప బడవలసినంత అధ్వాన్నంగా ఉండదని పైన నేనుదహరించిన రెండు పద్యాలు సాక్ష్యమిస్తాయి. ఏమైనా దీనిపై సమగ్ర చర్చతోపాటు ఈకవి పద్యరచనా నైపుణ్యాన్ని, పంచామర పన్నాలను పరుగులెత్తించిన తీరును రెండవసంపుటిలో పరామర్శిస్తాను.

## పురుషోత్తం చౌధరి భక్తిగీతరచన

వస్తుతాః బెంగాల్‌కు చెందినప్పటికి, తెలుగు ఓఢ్ర భాషల పై ఈయనకెక్కువ అధికృత ఉన్నది. సంస్కృతం సంగతి సరేసరి! ఆకాలంలో పెద్ద డిగ్రీలేమి ఈయనకున్నట్లు దాఖలాలులేవు. కాకుంటె సంప్రదాయ పరంగా పర్లాకిమిడి పాలకులందించిన గ్రామాల అజమాయిషీచేసి, శిస్తు వసూలుచేసి జమచేయడానికవసరమైనంత వరకు విద్యనభ్యసించారు. అయితే ఈయన మొదట్నుండి జిజ్ఞాసి. అందుకే అటు ఓఢ్రంతోపాటు ఇటు సంస్కృతాన్ని తెలుగు నభ్యసించి, ఇరవై సంవత్సరాల ప్రాయం నాటికే ఈయన కవిత్వంలో దోబూచులాడుతున్న "మృదుమధుర పదజాలమునకును, కవితా నైపుణ్యతకును, ఆయనను శ్లాఘించి, గొప్పగాను, మెప్పుగాను జూచినందున" తాను కాశీవెళ్ళి విద్యావ్యాసంగ మొనర్ప సమకట్టాడు. కాశీకైతే వెళ్ళలేదు, కాని కవిత్వంలో మాత్రం లోతులు చూసాడు.

తనకున్న సర్వస్వాన్ని ఏకోన్ముఖంచేసి శ్రమలో, దుఃఖంలో, బలహీనతలో, కార్యసాధనలో, అపజయంలో, విజయంలో సమానమైన గుండెదిట

వును ప్రదర్శించి, అటు పోటుల సమంగా స్వీకరింపగల నిండు మనిషి పురుషోత్తంచౌధరి. ఏరికోరి క్రీస్తునంగీకరించి, అందువల్ల ఎదురైన దూషణాలను భూషణాలుగా ధరించిన వాడు. ఆయన జీవితంలో తటస్థించిన ప్రతి సంఘటన ఒకకథా వస్తువైంది. ప్రతి అనుభవమొక ప్రేరణకారణమైంది. ఈయన భక్తి అనుభవజన్యమైనదేకాని, అన్వేషణా పూరితంకాదు. అందుకే ఆయన వ్రాసిన ప్రతిగీతం భక్తిభావం, పదాలకూర్పుతో తొణికిసలాడుతూ నిండుకుండలా నిండుచూలాలిలా బరువుగా వుంటుంది. ఇది అందరికీ అలవడే సామాన్య లక్షణం కాదు.

1833 అక్టోబరు 6వ తేదీన ఆయన క్రైస్తవ మతదీక్షను గైకొని, తొలి సారిగా క్రీస్తు తోడి ప్రత్యక్షానుభవాన్ని పొంది, కవి, "మా యేసుక్రీస్తుని మరుగు గల్గెనురా-నాయాత్మఘన రక్ష నగము నెక్కెనురా" అని కమ్మని కంఠమెత్తి సభాసదుల మానసాలను దోచుకొన్నారు. క్రైస్తవ రచనలకు సంబంధించినంత వరకు ఇది ఆయన తొలిరచన. ఇది తెలుగులో వెలసిన మొదటి క్రైస్తవ భక్తి గీతం. ఇంతదనుక తన భౌతిక దృష్టికి మరుగైయున్న క్రీస్తుతో ప్రత్యక్షానుభవం గలగడంతో, తన ప్రభువుకు తనకున్న మరుగు తొలగిందట. అనగా ఆ సుందర రూపాన్ని కన్నులార చూచాడట. అంతటితో ఆయన ఆత్మ ఘనమైన రక్షణ అనే నగాని కెక్కిందట. ఈ కీర్తనలో కవి ఒక క్రమాన్ని సూచించాడు. ఎవరైన ముందు తన నిజస్థితిని గ్రహిస్తేనే గాని, తన జీవితానికవసరమైన దేదో తెలుసుకోలేరు. అలావ్యక్తి తన దోషాలను గ్రహించగలగడం తన స్థితిని గుర్తించడం మొదటిదశ. ఆ దోష నివారణకు ప్రయత్నించడం రెండవదశ. ఈ సందర్భంగా ఈ కవి అంటాడు.

మతిలోని లోతు - మర్మము గానబడెరా మితిలేని ఘనపాపమే నిండుకొనెరా
హితముగ తన జీవ-మిచ్చే క్రీస్తుడురా మృతిచేత మన పాప - వితతిగొట్టెనురా
॥మాయేసు॥

పాప శృంఖలాలు తెగిపోయాక "నవసత్క్రైస్తవ గోష్ఠి నాకబ్బెనురా" అని ఉప్పొంగి పోయాడు. ఈ నవసత్క్రైస్తవ గోష్ఠి ఆ నాటి కటక్‌పురిలోని క్రైస్తవ సంఘాన్ని సూచిస్తుంది. ఈ కీర్తన అంతటిలో మొత్తం ఏడు చరణాలుండగా ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంథంలో ఆరుమాత్రమే కూర్చబడ్డాయి. అక్కడలేని చరణాన్ని ఈ దిగువ పొందుపరుస్తున్నాను.

రాగ ద్వేషముల సం - భ్రమ మెల్లపీడెరా
మూగబొమ్మలు పాద - ముల ద్రొక్కబడెరా
యోగ మార్గములెల్ల - ఓటి కుండలురా
సాగు పాపపుబుద్ధి - చతికిల బడెరా ॥మాయే॥

ఒకనాటి తన జీవన విధానాన్ని జ్ఞాపకం చేసికొని, నూతన మతానుభవాన్ని పొంది వ్రాసిన గీతమిది. ఈ భక్తునికి క్రీస్తు బోధలందు గల నమ్మికకీచరణం చాలు. ఈ కీర్తనలోన ఏడు చరణాలలో యతి ప్రాసలమరడమే కాదు, ప్రతి చరణంలో ఒక భావాన్ని వెలువరించి అందుకనువైన తగిన పదాలను ప్రయోగించి గీతానికొక నడకను సాధించాడు కవి.

ఈ కవి కలంనుండి వెలువడ్డ 130 అపురూపమైన భక్తి గీతాలనొక్కొక్క దాన్ని పరిశీలించడం అంటే మరొక ఉద్గ్రంథాన్ని వ్రాయడం అన్న మాట. అయినా ఈ నూట ముప్పయి కీర్తనల్లో కనిపించే లక్షణాలను బట్టి వాటిని వందన, విజ్ఞాపన, పరితాప, ఆత్మానంద, ప్రబోధాత్మక సిద్ధపాటు గీతాలుగా వర్గీకరించి, ప్రతి వర్గం నుండి రెండు మూడింటినైన పరిశీలిస్తేనేగాని ఈతని గళం విందులు, కలం చిందులు తెలియరావు.

**1. వందన గీతాలు :** 4, 25, 72, 73, 74, 75, 89, 586 కీర్తనలీకోవకు చెందుతాయి.

ఇందు నాల్గవ కీర్తన ఈ కవి భాషా నైపుణ్యానికి, పద ప్రయోగానికి, పదాల విరుపునకు తార్కాణం. ఇది కేదార గౌళరాగం, ఆదితాళంలో నిపతించ బడింది.

దేవా - దివ్యానంత ప్ర - భావ - మాం పాహి ఘన యె - హోవా=
స్థావర జంగమ - సహిత నిఖిలజగ - దావన పావన - భావ నిరంతర ॥దేవా॥

అనంత ప్రభాశోభితుడైన దేవుణ్ణి, సర్వ జీవరాసిని పవిత్రీకరించి పోషించువాడా అని సంబోధించి, తానెందుకు అయన్ను స్తుతించవలసి వచ్చిందో మొదటి చరణంలో సూచించాడు. "ఘోరమైన సం-సారాటవి బడి-దారి గనని నను-జేర బిలిచితివి" గదా అంటాడు. దేవుడు అక్షీణ విభవానందుడట. 'మోక్ష రాజ్య మహిమాధ్యక్షుడట. 'సుజన రక్ష'కుడట. 'కపట దుర్మనుజ శిక్ష'కుడట.

ఇలా 'అంటూ కటాక్షము నాదెస - దీక్షను నిలుపవె' అని మనవి చేస్తాడు రెండవ చరణంలో.

ఈ కీర్తన ప్రాస, అంత్య ప్రాసలతోపాటు, పదాల విరుపు వీనులకు విందు చేస్తుంది.

73, 74, 75 కీర్తనలు కుమారదేవుడైన క్రీస్తు ప్రభువునకు స్తుతులు చెల్లించేవి. ఈ మూడు కీర్తనలలో కవి ప్రయోగించిన పదాలు క్రీస్తు ప్రభువు యొక్క మూర్తిమత్వాన్ని (Personality) ఆయన సాధించిన రక్షణా కార్యాన్ని (Work of Christ) నిర్దుష్టంగా వివరిస్తున్నాయి. 73, 74 కీర్తనలు వాని నడకలో, భావంలో, శైలిలో అవిభాజ్యంగా ఉన్నాయి.

"మంగళమే యేసునకు - మనుజావతారునకు" అను పల్లవితో ప్రారంభించి, 'దురిత సంహారునకు - వరసుగుణోదారునకు - కరుణా సంపన్నునకు - జ్ఞాన దీప్తునకు' అని పాదాన్ని ముగించి "మంగళమే యేసునకు" అను పల్లవికి సంధించడంతో కీర్తన ఎత్తుగడలో సౌలభ్యాన్నేగాక పాద ముగింపుకు, పల్లవి ప్రారంభాని కొక సంబంధాన్ని సాధించాడు కవి. అలానే 'మరియా తనూజునకు- మహిమా గంభీరునకు - పరిశుద్ధాచరణునకు - బరమేశ్వర నీకు, వందనమే యేసునకు' అంటాడు 74వ కీర్తనలో. ఈ కీర్తనలో "రాజులపై రాజునకు - రవికోటి తేజునకు - పూజార్హ పదాబ్జునకు - భువనావన నీకు వందనమే" అని పదాల లాలిత్యాన్ని తన స్వంతం చేసికొన్నాడు. వ్యర్థ పదప్రయోగం గాని, భావ సంకోచంగాని లేకుండా తాను చెప్పవలసిందాన్ని స్పష్టంగా చెప్పడం ఈ కవి లక్షణం.

## 2. విజ్ఞాపన కీర్తనలు : 179, 373, 377, 393.

క్రీస్తు సిలువపై శ్రమపడుట నూహించి ఆ బాధల తీవ్రత మనసును కలచివేయగా కవి-

"నాయన్న రాగదే - ఓ యేసు తండ్రి - నాయన్న రాగదే =
నా ప్రాణధనమా - నా పట్టు కొమ్మా - నాముద్దుమాట - నాముక్తి బాట
నాయన్న రాగదే - నాయన్న సిలువలో నీ - వాయాస పడిన నాటి-
నీ యంఘ్రి యుగము నిపుడు - నా యాసదీర జూతు ॥నాయన్న॥"

ఇందలి 'నాయన్న', 'నా ముక్తి బాట' అనే పదాలు కవిహృదయ వేదనను చెప్పకయే చెప్పతున్నాయి. 'నా పట్టు కొమ్మ', 'నా ముద్దుమూట' అనే తెలుగు జాతీయాలు సందర్భోచిత స్థానాన్ని పొందాయి.

"దాసుల ప్రార్థన దప్పక యొసగెడు"–(373) అనే కీర్తన ఈతనికి క్రీస్తునందు గల విశ్వాసానికి ప్రబల తార్కాణం. ఇక 377 కీర్తన ఈయన పరతంత్ర భక్తికే నిదర్శనం. 'నన్ను గన్నయ్య రావె నా యేసు–నన్ను గన్నయ్య రావె నా ప్రభువా' అని పిలుచుకొని, తన ఇబ్బందుల నేకరువుపెట్టి, వానినుండి కడతేర్చుమని, 'దారుణ సంసార వారధి - దరిజూపి ప్రోవ నీకన్నను కారణ గురువు లింకెవ్వరు - లేరయ్య లేరయ్య లేరయ్య తండ్రి ॥నన్ను॥' 'సంసార సాగరాన్ని దాట నీకంటె గురువు లెవరున్నారయ్యా' అని తన పరాధీన స్థితిని స్పష్టంచేస్తాడు. 'నావంటి దుష్కర్మజీవిని - దీవించి రక్షింప కేవల మగు నీదు ప్రేమయే కారణం' అని నిండుహృదయంతో చేతులు మోడుస్తాడు కవి.

## 3. పరితాప కీర్తనలు : 313, 319, 473

ఈ కవి జీవిత విశేషాలను పరిశీలిస్తున్నపుడే బలహీనతకు లోనై అడుసులో కాలు వేసాడని మనం తెలుసుకున్నాం. ఈ కీర్తనల వెనుక నున్న వేదన అదే. జీవిత పరమావధిని, నైతిక ప్రవర్తనా విలువను, ప్రయోజనాన్ని గుర్తించి, అనేకులకు ప్రబోధించినమీదట కాలుజారాడు శ్రీ పురుషోత్తం చౌధరి. దానితో ఆయన మనసు విలవిలలాడింది. అహోరాత్రులు వంశధార ఇసుకతిన్నెలపై అపరాధ పరిహారార్థం అలమటిస్తున్నాడు. హృదయం వ్యథకు గురైనపుడు వెలువడేది కవిత్వం. ఆ వ్యథలోనే క్రైస్తవ సంఘం పది కాలాలు పాడుకోదగిన కీర్తనలు కూర్చాడీ భక్తకవి.

"ఎరిగి ఎరిగి చెడిపోతివి మనసా - ఇక నీ దిక్కెవ్వరు చెపుమా ॥
దురితంబిది స–చ్చరితం బిది యని - యెరుక సరకు గొన-కేమియు నీ ॥
సకలము జూచెడు దేవుని కంటికి - జాటుగ జరిగెడి పనియేది ॥
ఇక జెవి గుసగుస-లెల్లను దిక్కుల - బ్రకటముజేసెడు-ప్రభువున్నాడని ॥

తెలిసి చేసిన తప్పుకు పరిహారం లేదని ప్రబోధం. ఆ ప్రబోధాన్ని జ్ఞాపకం చేసికొని మనసును సంబోధిస్తూ 'ఇది దురితం ఇది సచ్చరితం' అనే విచక్షణను

కోల్పోయావు గదా 'ఇక నీ దిక్కెవ్వరు చెపుమా' అంటూ ప్రశ్నిస్తాడు. ప్రలోభించి పాపం చేసావు. కాని దేవుని కంటి కది మరుగై ఉంటుందా ! 'ఇది దేవుని దయ' 'ఇది క్రీస్తుని ప్రియ'మని 'అనుభవ మెరిగి' 'దుర్మదమున - దుష్కృత పదమున' పడ్డావు కదా ఇక నీ దిక్కెవ్వరు ? తప్పుచేయడం గొప్పతనం కాదు. ఆ తప్పుకొరకై పరితపించి నిష్కృతి పొందడం గొప్ప. ఆచారాలతో గాక, అనుభవంలో ఆచరణలో క్రీస్తు బోధల సారాంశాన్ని అవలంబిస్తున్నాడు. కనుకే చౌధరి కవి తన తప్పుకు పరిపరివిధాల ప్రలాపించాడు. అంతట కూడా ఆయన ఆరాటం శాంతింపలేదు– "త్రాహిమాం క్రీస్తునాథ - దయ జూడ రావే - నేను దేహి యనుచు నీ పాదములే దిక్కుగా" జేరానని వాపోయాడు.

పొల్లుకు చెల్లని ఇంద్రియాసక్తుడనై అపకీర్తిపాలయ్యాను. నేను ఆలోచిస్తున్నకొద్ది నా పాపరాశి పెరుగుతుందే గాని తరుగదు నేనేమి చేయాలి అంటూ

"నిబ్బర మొక్కించుకైన - నిజము రవ్వంతైన లేక
దబ్బర లాడుటకు ము-త్రాతనైతిని
అబ్బురమైన ఘోర పా-పాంధకార కూపమందు
దబ్బున బడిపోతినయ్యో - దారి చెడి నే నబ్బబ్బా ॥త్రాహి॥"

ఈ చరణం మానవ చిత్తప్రవృత్తిని స్పష్టంచేస్తుంది. నిజం, నిబ్బరంలేకపోవడం, దబ్బరలాడడం మామూలుగా జరిగే పని. అయితే ఈ తప్పటడుగు వేయడానికి కారణం దేవుని దగ్గరకు నడిపే 'దారి చెడిపోవడం' అని చమత్కరించాడు కవి. ఇంతగా గుండె కుదిలించి దేవుని సన్నిధిలో కుప్పవోసి, ఒకానొక తప్పుకై కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న చౌధరిని రెవ. లేసీ దొర సమీపించి 'మీరింతగా విలపిస్తున్నారు గదా, నిజ పశ్చాత్తాపానికి, పరితాపానికి ఫలితం పాపక్షమ అని మీకు తెలియదా? మీకు నిష్కృతి కలిగిందనే విశ్వాసం లేదా ?' అని ప్రశ్నిస్తే చౌధరి క్షణంపాటు నిశ్చేష్టుడై, ప్రాన్పడిపోయి లేసీ భక్తుని కంజలించాడు. చౌధరి నయనాలు జలాశయాలయ్యాయి. చెప్పరాని ఏదోఒక అనుభూతి ఆయనకు కలిగింది. మనసు స్థిమితపడింది. అంతరంగం ఆనందంతో గంతులు వేసింది. నూతనానుభూతితో గళం పెగిలింది. మాటలు దొర్లాయి. ఆనంద గీతాలు వరుసగా పరవళ్ళు త్రొక్కాయి. ఆ ఫలితమే–

**4, ఆత్మానందగీతాలు :** ఈకోవలో 16, 390, 394, 498 కీర్తనలు పరిశీలనార్హాలు. తిరిగి తన హృదయాన్నుద్దేశించి కవి (-394),

ఎందుకే చింతించెదవు నాడెందమా - నీకందమా
ఇందాక రక్షించిన వా-డిక నిన్ను విడువబోడు ॥
తొల్లి నీవొనరించినట్టి-దోషమెంతో యరసి చూడు
చెల్లచెదరై పఱచు తరిని-చెయ్యిదాపి పట్టినాడు
అల్లుకొనిన నీదుర్గణము-లణగ ద్రొక్కి వేసినాడు
తల్లడిల్ల జేయు నీ శా-త్రవుల దరిమి ద్రోచినాడు
వల్లగాదన్నాడా నేడు—వద్దు సందేహంబులు వీడు" ॥
ఎందుకే చింతిస్తావని ఊరడించుకొన్నాడు హృదయాన్ని.

390 కీర్తనలో "నిమ్మళము నొందుము రక్షకుని పలుకు-నమ్మి కొని యుండుమని" మనసునకు ధైర్యం చెప్పుకున్నాడు. ఎందుకంటే "ఇమ్మహిని బాపులకు నైప-క్షమ్ముజేసి పరాత్పరుని సముఖమ్మునందు చిత్తమ్ముగా-కాయమ్ము బలియిడు నీప్రభువున్నాడు" గనుక శాంతించు మంటాడు. ఇది అనుభవైక వేద్యమైన భక్తి. ఎపుడో ఒకపుడు, ఏదో జరుగుబోతుందని ఎదురు చూడ్డంగాక, ఇక్కడే ఇపుడే ఆ అనుభవాన్ని రుచిచూడడం క్రీస్తుమత భక్తుల లక్షణం. ఆవి ధంగా జీవితం క్రొత్తచివుళ్ళు తొడిగింది గనుక ఆనందించి-

"మనసానందము బొందుట కన్నను-మరి యే భాగ్యము గలదన్న=
అనుమానములిక నఖిల సుఖంబులు-దినమొక గడియొక-తీరై యుండును"
అన్నాడు.

"క్షమయును స్నేహము ప్రభుకడ నేర్చిన-శత్రువులిక భువి లేరన్న=
సమదృష్టి జగ-జ్జనుల గనుంగొను-సత్క్రైస్తవులకు-సాధనమనదగు" ॥

ఇదొక అనుభవం-ఇది పొందిన వారి కవగతం కాగల ఆత్మానందం. దేవుడు తన మొరనాలించి పాపక్షమదయచేసినాడన్న సంతోషంతో కవి తెలుగు భక్తి సాహిత్యానికే మణి పూస కాగల గీతాన్ని ఆలపించాడు. చిత్త గించండి.

యెహోవ నామొఱ లాలించెను-దన-మహా దయను నను గణించెను-
అహర్నిశల దీన హీనుడగునా- దు హా యనెడు ధ్వని-
గ్రహించి మనిపెను ॥యె॥

1. పిశాచి గడిమి బడగొట్టెను - దన - వశాన నను నిలువబెట్టెను
ప్రశాంత మధుర సు - విశేష వాక్యల
నిశాంతమున జే-ర్చి సేదదీర్చెను ॥యెహోవ॥

2. అగణ్య పాపి యని త్రోయక న-న్ను గూర్చి తన సుతుని దాచక
తెగించి మృతి క - ప్పగించి పాపపు
నెగుల్ దిగుల్ సొగ - సుగా నణంచెను ॥యెహోవ॥

3. అనీతి వస్త్ర మెడలించెను - యే-సునాధు రక్తమున ముంచెను
వినూత్న యత్నమె - దనూని యెన్నడు గనన్
వినన్ ప్రేమ నాకు జూపెను ॥యెహోవ॥

ఈ కీర్తనలో మొత్తం అయిదు పాదాలున్నాయి. ఏ పాదాని కా పాదమే ఒక అపురూప శబ్దసుందరిలా కంటిముందు కనిపిస్తుంది. ఒక్కొక్క పాదంలో ఒక్కొక్క తలంపు. ఇట వ్యస్తపదాలకు తావులేదు. ఒక అక్షరాన్ని కలపడానికి వీల్లేదు. తొలగించడానికి వీల్లేదు. ఇదొక అపూర్వ రచన. ప్రతిపాదంలో ప్రారంభ గణం జగణం వాడడం మరో విశేషం. నీతిని వస్త్రంగా వర్ణించడం బైబిల్ అనువాద ఫలితంగా తెలియవచ్చిన విదేశీ భాషా సంప్రదాయం. దాన్ని స్వంతం చేసికొని భాషా సౌష్ఠవానికి పుష్టిని కలిగించా డీ కవి.

**5. ప్రబోధాత్మక గీతాలు :** ఏ మతానికైనా ప్రచార మొక లక్షణం. ప్రచారం లేని మతం మృతం. ప్రచారానికి సాహిత్యం శరీరం కాగా ప్రబోధం ప్రాణం. ఏరికోరి అనేక విషయాలను పరిశీలించిన మీదట క్రైస్తవుడైన కవి - అందున వేలకొలది మైళ్ళ దూరాన్ని కాలినడకను తిరిగి ప్రచారం చేసిన కవి - ప్రబోధాత్మకాలైన గీతాలు వ్రాయకుండా ఉండగలడా ! ఈయన గీతాలలో సగానికి పైగా ప్రబోధాత్మకాలే. ఇందు కొన్ని సువార్త సత్యాన్ని ప్రకటించేవి. కొన్ని తన జీవితానుభవాలు. మరికొన్ని క్రీస్తు సిలువమీద సాధించిన రక్షణ కార్యాన్ని వచ్చి అనుభవించుడనే ఆహ్వాన గీతాలు, ఎన్నో మరెన్నో. శంకరాభరణం ఆదితాళంలో వెలార్చిన ఈ ఆహ్వాన పదబంధాన్ని గమనించండి.

"రారె మన యేసు స్వామిని - జూతము కోర్కె
లూర ప్రియులారా - పేర్మిని - గూరిమి భక్తుల

జేరువ - విందట - భూరి దయామృత
సారము లొలికెడు - చారు కటాక్ష వి-శాలేక్షణుడట
నారకులగు నర - నారీజనులకు
దారక మొసగను - దానె పిలుచునట
దారుణ పాప మ-హారణ్యమునకు
గారుచిచ్చు గతి - గన్పడు వాడట
ఘోర దరిద్రత గూల్చెడి వాడట
సారం బగు తన - సభకు మకుటమట ॥రా రే॥

ఇదొక విలక్షణమైన గీతం. ప్రతి పాదం సుదీర్ఘం. ప్రతి మాట భావబంధురం. భక్తిగీత రచనలో పరాకాష్ఠ నందుకుంటేనే గాని సాధ్యం గాని విధానమిది.

16 పాదాలతో క్రీస్తుప్రభుని బోధలు, అద్భుతాలను వివరించే గీతం. 150.

క్రీస్తు సిలువ మరణాల వర్ణనతోనిండిన కీర్తనలు 178, 184, 187, 188.

మహిమాన్విత శరీరంతో మేఘారూఢుడై, లోకాంతమున తీర్పుచెప్పటకు క్రీస్తు రానైయున్నాడని ప్రకటించేది 228వ కీర్తన.

252 బైబిల్ గొప్పతనాన్ని, దైవవాక్య ప్రభావాన్ని విశదీకరిస్తుంది.

క్రీస్తు మినహా నరుల ఆధ్యాత్మిక జీవితానికి తోడ్పడే వారెవరు లేరని 289 కీర్తన చేసే ప్రబోధం.

"యేసునాథ కథా సుధారస - మిదిగో పానము జేయరే
దోసకారి జనంబులారా - దురిత భవముల బాయరే"

అని ఆహ్వానించే కీర్తన 299.

ప్రబోధాత్మకాలైన ఈ కవి గీతాల్లో అనేకం క్రీస్తుమత సూత్రాలను విస్తృతంగా వివరిస్తాయి. అందలి ప్రతి పాట పఠింప దగింది, ప్రతి మాట పాటింప దగింది.

## 6. సిద్ధపాటు కీర్తనలు : 315, 484, 485, 486. 504

వయసులో ఎదుగుతున్నకొద్ది క్రీస్తునందలి ప్రేమానుభావాల్లోను పెరిగిన కవి రానురాను, లోకాన్ని ఈసడించుకొంటూ మరణాన్ని ఆహ్వానిస్తూ ఎన్నో

కీర్తనలు వ్రాసాడు. "ఉన్నపాటున వచ్చు - చున్నాను నీపాద - సన్నిధికో రక్షకా" అని తన సంసిద్ధతను వ్యక్తం చేస్తాడు కవి 815వ కీర్తనలో. నా మన సునుదోష సమూహాలు మచ్చెలై కప్పివేసాయి. అందువల్ల మైలపడిపోయిన మనసును నీ రక్తంచే ప్రక్షాళన చేయమంటాడు. ఎంత హృద్యమంగా చెప్పాడో చూడండి ఆ భావాన్ని -

"మసిబొగ్గువలె నా మా - నసమెల్ల గప్పి దో
ష సమూహములు మచ్చలై - అసితమగు ప్రతి డాగు తుడువను
గసటు గడిగి పవిత్ర పరపను - నసువు లిడు నీ రక్తమే యని
మసల కిప్పుడు సిలువ నిడెగని ॥ఉన్న॥"

ఈ లోకంలో నా జీవనయాత్ర సంకటాలతో, పోరాటాలతో నిండి ఉంది. ఈ పోరాటాలలో నలిగి దుర్బలుడనై ఉన్నాను. ఉన్నపాటున వచ్చుచున్నాను చేర్చుకోమని ప్రాధేయపడ్డాడు. లోకాన్ని, లోకాశలను వీడి పోవడం అంటే దేవుని సన్నిధిలో ఉండడం అనే భావన దివ్యమైంది. జీవాత్మ పరమాత్మలో లీనం కావడం కాదుగాని, దేవుని సన్నిధిలో ప్రవేశించి ఆయన్ని స్తుతించడం అని స్పష్టం చేసాడు చౌధరి. "పైన మైయున్నానయ్యా" అనే 486 కీర్తనలో కూడా ఇదే భావనను కవి వ్యక్తీకరించాడు.

"ఎండమావుల కీడైనట్టి - యిహ సౌఖ్యములు త్వరగా బోవు నీ
నిండు దరుగని నిత్యానందంబు - దండిగ నీయం
దుండిన వారిక - ఖండామృత సౌ-ఖ్యము లిచ్చెదవట
తండ్రీ భవ దుత్తమ దా సు ల నీ - వుండిన చోటనె - యుంచుము
చాలును ॥పైనమై॥

ఈ కీర్తనలో కనిపించే 'దీనుడ భవదాదీనుడ', 'శరణాగతునకు దిక్కెవ్వరు', 'తల్లియు తండ్రియు దాతవు నీవె', 'కాలదండము గిరగిర ద్రిప్పుట', 'భవత్కరుణాలింగన సుఖము', 'ఎండమావుల కీడైనట్టి ఇహ సుఖములు', 'అఖండామృత సౌఖ్యములిచ్చుట', ప్రయోగాలు, అవి అందించు భావాలు ఈ భక్త కవికి భారతీయ వేదాంత శాస్త్రముతోగల పరిచయాన్ని సూచిస్తాయి. చావు పడక మీద కవి, తన దేహంలోని ఒక్కొక్క అవయవాన్ని ఉద్దేశించి, ఆ అవ

యపం గతంలో చేసిన పనిని జ్ఞాపకం చేసి 'ఇక నీపని అయింది, నన్ను వీడి పొమ్మంటాడు'. 'సకలేంద్రియములారా' అనే 485 కీర్తనలో. ఇందు 9 చర ణాలున్నాయి. పంచేంద్రియాల నుద్దేశించి 'మీ బలముడిగె ........ దేవ కృపలో నుంచి నను గదిలింప మీకది కొంచెమగు పని కాదు సుండి' అని, శ్రవణేంద్రి యమ - - - చెవుడు నీకిపుడనుసరించెను ........ జరిగి పొమ్మిక అని; ఇలా ప్రతి అవయవాన్ని హెచ్చరిస్తాడు కవి. ఇందు ప్రతి చరణం ఒక తత్వం, జీవిత సత్యం. వానిని చదివి, పాడి మర్మగర్భితమైన భావాల గ్రహించవల సిందేః తుదకంటాడు.

ఈ సంసారంబునం - దేమి సౌఖ్యము గలదు
ఆశ మాత్రమె గాని యది చిరము గాదు
యేసుక్రీస్తుడు తండ్రి దేవుడు - భాసురంబగు నిర్మలాత్మయు
దాసులకు దమ దివ్యమగు కృప-జేసి నిత్య నివాసమిత్తురు ॥ సకలేంద్రి॥

ఇక కొన్ని దినాలలో తాను చిరకాలంగా ఎదురుచూస్తున్న పరమ పదాన్ని దృష్టించి ఆ పరిశుద్ధ నివాస స్థాన లక్షణాలను ప్రత్యక్షం గావించాడు 504వ కీర్తనలో. అట పరిశుద్ధి పరిశుద్ధియని వినబడుతుందట. రవితోగాని, చంద్రునితో గాని తనకి పనిలేదు. 'అనగా లోకానికి వెలుగై యున్నాన"ని చెప్పిన ప్రభువే అక్కడ ఉంటే ఆయన చేతి పనియైన సూర్యచంద్రాదుల వెలుగుతో అవసరం లేదను భావాన్ని కవి ఇట ధ్వనింపజేశాడు. ఇది వాక్యానుభవంవల్ల ప్రభావితమై సాక్షాత్కరించిన భావం. అట 'మృదు జీవోదకాల' ప్రభువు యిస్తాడు. కాన ఆకలి దప్పు లుండవట. మచ్చున కొక్క చరణం.

"జననంబు మరణంబు - సంసార సుఖ బాధ
లనుభవించుట గల్గి - దాపురమునందు
మును నీతికొఱకు కాప - దనుబొందు తన వారి
కనునీళ్ళన్నియు దుడుచు - మన దేవుడందుండి ॥పరి॥

## 7. ఆదరణ గీతాలు : 137, 138, 174, 435, 580

తాను క్రీస్తు నంగీకరించి, సంకటాల సందిట బడినపుడు మిత్రులు వేసిన ప్రశ్నలకు కవి మాటల్లోగాదు, పాటల్లో సమాధానం చెప్పాడు. "క్రైస్తవుడు

కావడం దేనికి, ఈ బాధల్ని కొని తెచ్చుకోవడం దేనికి" అని అడిగిన వారికి "శీలమతుల - పాలివెతల - తూల జనదోలి తన జాలి కనపరచు" "యేసు నామమెంతో మధురం" అనే 137వ గీతం, "యేసు నామమే పావనము, మాకు-యేసే గదా నిత్య జీవనం" (138) జవాబు. ప్రతి పాదం మొదటి పంక్తిలో ఈ కవి మంచి సమాంతర పదాల ప్రయోగించాడు.

"సాధు మానసోల్లాసములు యేసు - నాధు గుణ చిద్విలాసములు"
"భక్తజన లోక పూజ్యములు రక్త - సిక్త పాదపయోజములు"
"దీనజన నిత్య తోషణము-సిల్వ-మ్రాని ప్రభు మృత్యు ఘోషణము"
"పాపులకు మంచి పక్షములు - ముక్తి- జూపు క్రీస్తు కటాక్షములు"

ఇవి అపురూప ప్రయోగాలు. తెలుగు భక్తి సాహిత్యానికి మణిమయ తోరణాలు. తనను కన్నవారు, తోబుట్టువులు వదిలివేసి నప్పటికి తన కేవిధమైన చీకు, చింత లేదట. ఎందుకంటే

"యేసు వంటి ప్రియబంధువు నాకిక - ఇహ పరములలో లేడు" కాన,
ఊరు పేరు పరువులు మురువులు మరి-యూడ గొట్టబడినను గాని
కూరిమితో క్రీస్తుడు మాకుండిన-కొదువరాదు గొప్పయుపోదు ॥యేసు॥
తల్లిదండ్రులు విడిచినగాని-తాను వదల డెప్పుడు మమ్ము-
ఉల్లమునెత్తి పిలిచినవేళ-నోహోయనుచు దరికి వచ్చు ॥యేసు॥

నాకు తల్లి ఎవరు, తండ్రి ఎవరు? అన్నిటికి ఆ యెహోవాయేగదా అనే భావాన్ని కవి 485వ కీర్తనలో చెప్పాడు.

"యెహోవా మాతండ్రిగాద-యేసుడు మాయన్నగాద" అని దేవుని తండ్రిగా, ఆయన జనితైక కుమారుని సోదరునిగా ఎంచుకున్న భక్తునికి లోక బంధుత్వం అంటే ఏపాటిది?

తనువు బలిపెట్టెను-మాయన్న-తప్పుల్విడ గొట్టెను మాతండ్రి
మనసులో సాక్ష్యమిట్లున్న-మనుజులెట్లన్నను మాకేమి ॥యెహోవా॥
కరములతో నంటరాని-కన్నులకు గోచరముగాని-
పరమఫలముల్ మాకున్నపుడు - సరకుగొనమిక్కడి లేములకు
॥యెహో॥

కంటి కగోచరమైన పరమ ఫలాలున్నపు డిక్కడ లేమి మమ్మేల్నేం చేస్తుంది పొమ్మన్నాడు. ఎంత గుండె దిటవు! తను నమ్ము కొన్న వాని యందెంత అచంచల విశ్వాసం. ఇది అందరికి ఎలా సాధ్యం? తమకు బంధు వర్గంనుండి ఛీత్కారా లెదురౌతున్నాయని, సాటి వారు సూటిపోటి మాటలతో వేటాడుతున్నారని ఒకపుడు భార్య బాధపడుతూంటే ఆమెను సాదరంగా జేర బిలిచి (480)

లోకమువారెల్ల-లోకువ జూచిన-లోపము నీకేమిటే సఖియా-
ప్రాకటమగు క్రీస్తు-పతిత పావన మూర్తి
నీ కోసమై ముక్తి-నిలయమ్ము గట్టంగ ॥లోక॥ అని ఓదార్చాడు.
దరిలేని దురిత దు-స్తర పారావారము దాటించు వారెవ్వరు - భీ
కరమైన-నరకాగ్ని బెట్టు బం-ధుర దేవ కోపాగ్ని - మరలించు వారెవ్వరు
చంచలబుద్ధి స్థిరపరచి పరమార్థ-మెరిగించి చిరముక్తి
గురిదెల్పు వారెవ్వరు-ఈ-ధరలోన
నరరూపు దాల్చి నీ-కొరకై జీవనమిచ్చు
కరుణాబ్ధి క్రీస్తుండు-వరదుడై యుండగ ॥లోకము॥

ఈనాడు మనల్ని చూచి, ఐహికంగా మనం పడుతున్న బాధల్ని చూచి పలికే లోకుల వాక్కులకు వ్యాకుల పడనక్కరలేదు. ఎందుకంటే నీడలేని పక్షులుగాఉన్న మనకోసం పావనమూర్తి క్రీస్తు వి మో చ నా సౌధాన్ని నిర్మించాడు గదా అంటాడు.

ఈ నవ్వుతున్న వారిలో అనంతమైన పాపసాగరాన్ని దాటించగలవారు న్నారా? పాపఫలితంగా వచ్చిన దేవుని కోపాగ్నినుండి తప్పించే వారున్నారా? బుద్ధి చాంచల్యాన్ని క్రమపరచి జీవిత పరమార్థాన్ని బోధించే దెవరు? వీటన్నింటిని మించిన కరుణా వరదుడు క్రీస్తుడుంటే మన కేం కొదువ' అని ఊరడిస్తాడు భార్యని. ఈ కీర్తనలో 3 పాదాలున్నాయి. మూడు కూడ ఐహికాముష్మిక జీవన విధానాలకు గల తారతమ్యాన్ని బోధించడంతో పాటు, లౌకికమైన ప్రతిదీ అనిత్య మని, నిత్యానందం కోసం శ్రమపడక తప్పదని తెలియపరుస్తాయి. నూతన నిబంధనా బోధల సారాంశాన్ని, పార లౌకిక జీవిత సౌభాగ్యాన్ని ఈ కీర్తనలో పొందికగా అందించాడు కవి. 'రాబోవు మహిమ ఎదుటి ఇప్పటి శ్రమ లెన్న దగినవి కా'వనే సూత్రాన్ని జీవితంలో ఆచరించిన మహాభక్తాగ్రేసరుడు పురుషోత్తం చౌధరి.

చౌధరి గీతరచనలో పల్లవికి, పాద ముగింపుకు సాధించిన బిగింపు, వృత్త్యానుప్రాస, అనుప్రాసల పోషింపు, ఉపమ, ఉల్లేఖాలంకారాల చెలాయింపు పదాల కుదింపు భావాలమదింపు తెలుగుభాష కొక సొంపు, పాఠకుల చెవి కొక ఇంపు. ఇది ఈయన ప్రత్యేకత. ఈ గీతాల్లో భాష స్వైరవిహారం చేస్తుంటే, భావం జోడుగుర్రాలపై పరుగుదీస్తుంది. పాటకు ప్రాస, అంత్యప్రాస ప్రాణమని ఎరిగిన ఈ కవి వానిని సాధ్యమైనంతవరకు పోషించాడు. ఒకవేళ ప్రాస తప్పిన తప్పునేమో గాని యతిని మాత్రం తప్పనీయడు. ఇది ఈయన స్వంతం చేసుకొన్న రచనావిధానం. చూడండి.

ఒక్క నీ తలవెంట్రుకయైన - నూడిపడదని చెప్పెడువాడు
దిక్కు నీకిక నేనే యని తన - దివ్య వాక్కుల దెలిపెడువాడు
చిక్కులను బెట్టెడు పగవారి - చేత నిను జిక్కింపనివాడు
ఇక్కట్టు మెట్టుల దాటించుట - కిదిగో యని చెయి యిచ్చెడువాడు
హక్కు లేదన్నాడ నేడు - అతడు నిను వెలివేయబోడు ॥ఎందుకీ॥

ఇందు ప్రాస, అంత్యప్రాసలతో పాటు యతి తప్పలేదు. అయితే ఈ కీర్తనలోనే మొదటి పాదంలో ఒకచోట యతి భేదించింది. 'తల్లడిల్లజేయు నీ శత్రువుల దరిమి ప్రోచినాడ'న్నపుడు తకారంపై అకారానికి ఉకార యతిని వేసినట్లు కన్పిస్తుంది. ఇది ఈ కవి దోషం కాదు. అచ్చువేయడానికి శుద్ధప్రతిని వ్రాస్తున్న వ్రాయస కాని దోషం. ఆ దోషాన్ని పసికట్టక ముద్రణకు పంపిన క్రైస్తవ కీర్తనల గ్రంథ పరిష్కర్తల దోషం. నిజానికి వారిని కూడా తప్పపట్టరాదు. ఎందుకంటే దాని విలువ వారికి తెలియదు గనుక. 'తల్లడిల్లజేయు నీ శాత్రవుల దరిమి బ్రోచినాడ'ని కవికృతమని నా భావం. 'శాత్రవు'డన్నందువల్ల అర్థం చెడదు. రాగ తాళాల కభ్యంతరం ఏర్పడదు. రెండింటిలో ఏ పదమైనా ఒకటేనని వాదించేవారుంటారు. కాని ఒక కవి లక్షణం అనవసరంగా వక్రించిందేమి అని బాధపడడం కద్దు. కవి ఈ పొరపాటుకు తావిచ్చాడంటె నమ్మడం కష్టం.

ఈ భక్తకవి గీతాల్లో అనుభవ భక్తి, మధురభక్తి ధోరణి లెక్కువ మోతాదులో కన్పించి, మనల పరవశత్వం చేస్తాయి.

పురుషోత్తం చౌధరి క్రైస్తవ భక్తిగీత రచనకు శ్రీకారం చుట్టి తెలుగు క్రైస్తవులకు మాత్రమే గాదు, అందు తాను ప్రయోగించిన వివిధ ప్రక్రియల ద్వారామొత్తం తెలుగు సాహితీప్రియులకే చిరస్మరణీయుడయ్యాడు. ఈతని రచనలపై సమగ్ర పరిశోధన జరిగే శుభదినంకోసం చూస్తున్నా. *